క్లుప్తంగా

14న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని డిసెంబర్ 14వతేదీన తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సులు బయలుదేరుతాయన్నారు. రాను, పోను చార్జీలు రూ.805 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 7382876638ను సంప్రదించాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మిట్టసోంపల్లిలో ఇరువర్గీయుల వారు ఘర్షణ పడ్డారు. ఇంటి వద్ద నిలిపిన గురుమూర్తి కుటుంబ సభ్యుల ద్విచక్ర వాహనాన్ని కరుణాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఆటోతో ఢీ కొట్టారనే విషయంపై ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో కరుణారెడ్డి మరో నలుగురు వ్యక్తులు కలసి గురుమూర్తితో పాటు మరో ఇద్దరిపై దాడి చేశారు. ఈ విషయంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసామని బాధితుడు గురుమూర్తి పేర్కొన్నాడు.

డైనింగ్ హాల్ ఏర్పాటు



డైనింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న దాత గాలి శ్రీనివాసులునాయుడు

కేవీపల్లె : మండలంలోని చిన్నకమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అమెరికా డల్లాస్‌లో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐ గాలి శ్రీనివాసులు నాయుడు విద్యార్థులకు సొంత నిధులతో డైనింగ్ హాల్ ఏర్పాటు చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం డైనింగ్ హాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతూరిపై మమకారంతో తాను చదివిన పాఠశాలకు సుమారు రూ. 6.5 లక్షలతో డైనింగ్ హాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాత తల్లిదండ్రులు రెడ్డెమ్మ, గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీపై ఆవిష్కరణలు అవసరం

కురబలకోట: నూతన టెక్నాలజీపై ఆవిష్కరణలు అవసరమని బెంగళూరుకు చెందిన ఇ–గవ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్ త్యాగరాజన్ తెలిపారు. సోమవారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులచే హ్యాకథాన్ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ టెక్ కంపెనీలతో పాటు చిన్న పాటి సంస్థలు కూడా టెక్నాలజీపై పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు చేస్తున్నాయన్నారు. ఆర్థిక వృద్ధి, మెరుగైన జీవన నాణ్యత, పర్యావరణ సుస్థిరత మొదలైన వాటిపై ప్రభావం ఉంటుందన్నారు. ఆవిష్కరణలు, హ్యాకథాన్‌లు విద్యార్థులను శక్తివంతం చేస్తాయన్నారు. విద్యార్థులు తపనతో పాటు పరిశోధన సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు.

ల్యాబ్‌లు సక్రమంగా నిర్వహించాలి

పీలేరు : స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏటీఈపీ ల్యాబ్ (టీబీ), ఐసీటీసీ ల్యాబ్‌లు సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శైలజ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ల్యాబ్‌లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిపోర్టులు పారదర్శకంగా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మోహన్, మునీశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ వై.బి. ధనలక్ష్మీ, సిబ్బంది మురళీమోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు గైడ్‌లైన్స్ తప్పక పాటించాలి

తంబళ్లపల్లె: పోలీసులు రిమాండ్‌పై హైకోర్టు గైడ్‌లైన్స్ తప్పక పాటించాలని ఏపీపీ వీరాంజనేయులు కోరారు. సోమవారం ములకలచెరువు సర్కిల్ సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐలతో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీపీ మాట్లాడుతూ మార్పులు చేసిన చట్టాలు, సెక్షన్లు ,రిమాండ్ రిపోర్టు తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే లోక్‌అదాలత్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు లోకేశ్వరరెడ్డి, గాయిత్రి, నరసింహుడు, రమణలు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించారని ఫిర్యాదు

తంబళ్లపల్లె: అన్నదమ్ములు తన భూమిని ఆక్రమించుకున్నారని తంబళ్లపల్లెకు చెందిన అంగజాల లక్ష్మపతి సోమవారం ఎస్‌ఐ లోకేష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. తంబళ్లపల్లెలోని లేట్ వెంకటాచలపతికి నలుగురు కుమారులు. భాగపరిష్కారం, పాత పట్టాదారు పాసుపుస్తకాల మేరకు భూమి 2003లో రిజిస్టర్ చేసుకున్నారు. సర్వే నంబర్ 838, 843లో నలుగురు అన్నదమ్ములకు భాగం ఉన్నా అన్నలు రఘురాము, శివరామకృష్ణలు తన భూమి ఆక్రమించుకున్నారని లక్ష్మీపతి ఆరోపించారు. ఆక్రమించుకున్న భూమిని కౌలుకు ఇచ్చారని, తన భూమిలో ఉపాధిహామీ పథకం ద్వారా వారు లబ్ధి పొంది శిలాఫలకం ఏర్పాటు చేశారని ఆరోపించారు.

శివాలయాలకు కార్తిక శోభ



యోగభోగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నిమ్మనపల్లె: కుమారస్వామి నది పవిత్ర జలాలను తీసుకొస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: కార్తిక సోమవారం పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని శివాలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. ఆలయ ఆవరణంలో దీపాలు పెట్టి పూజలు చేశారు. స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీయోగభోగేశ్వర స్వామి ఆలయం, సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయం, నీరుగట్టువారిపల్లె నీలకంఠేశ్వరస్వామి ఆలయాలు దీపాల వెలుగులతో నిండిపోయింది.

వైభవంగా నేల మల్లేశ్వర స్వామి కుంబాభిషేకం

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. కార్తికమాసంలో చివరి సోమవారం రోజున కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ఈఓ మంజుల ఆధ్వర్యంలో పూజారులు శంకర స్వామి, లక్ష్మణ స్వామి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మార్పూరి శశిధర్ , శంకర్ భాస్కర్ హాజరయ్యారు. అనంతరం పవిత్రజలాలతో స్వామివారిని అభిషేకించారు. లమల్లేశ్వరస్వామి భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చారు. కుంభాభిషేక మహోత్సవాన్ని ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు మేష రామకృష్ణ, సర్పంచ్ రెడ్డప్ప, రాజన్న పర్యవేక్షించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మదనపల్లె ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి కార్తికమాసం నాల్గవ సోమవారం కావడంతో భక్తులు పోటెత్తారు. కర్ణాటక, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. చింపిరివాండ్లపల్లెకు చెందిన సోమప్పగారి రాజారెడ్డి భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈఓ మునిరాజ, కొండకిట్టల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. మదనపల్లె వన్ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడిపారు.

కిటకిటలాడిన శివాలయాలు

రామసముద్రం : మండలంలోని శివాలయాలు కార్తిక చివరి సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. మూగవాడి గ్రామంలో వెలసిన శ్రీ పుండరీశ్వర స్వామి, బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వర స్వామి, రామసముద్రంలో. చంద్రశేఖర స్వామి, వాలీశ్వర స్వామి, గుంత యంబాడిలో శ్రీ పుండరీశ్వర స్వామి, చెంబకూరు లోకనాథ స్వామి ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో వందల సంఖ్యలో అభిషేకాల వరకు అర్చకులు చేశారు. హరినామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆలయాల్లో కేదారేశ్వరి వ్రతం నిర్వహించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని రామాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తల సురేంద్ర భార్య రెడ్డెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామానికి చేరుకొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డెమ్మ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించి వారి కుటుంభ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. అనంతరం రామాపురంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన ప్రజలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదునెలలు గడుస్తున్నా మహిళలకు ఒక్క సంక్షేమ పథకం అందించలేదన్నారు. చివరకు అమ్మఒడి పథకాన్ని కూడా ఇవ్వక పోవడం దారుణమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గాల్లో కలిసి పోయిందన్నారు. పావలావడ్డీ రుణాలు, డ్వాక్రా మహిళలకు ఏ ఒక్క పథకాన్ని ఇవ్వడం లేదన్నారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, మాజీ జెడ్పీటీసీలు రెడ్డిరాజా, రవి, సర్పంచ్‌లు యల్లారెడ్డి, మనిభాస్కర్,మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బి.కొత్తకోట: ఇళ్ల కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన పేద మహిళలతో కలిసి సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం ఇళ్ల స్థలాల కోసం అర్జీలు ఇచ్చేందుకు రావాలని నాయకులు పిలుపు ఇవ్వడంతో పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు. వారు వెంట తీసుకొచ్చిన దరఖాస్తు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, ఒక ఫొటో కలిగిన 570 పత్రాలను సామూహికంగా స్వీకరించారు. అనంతరం వారితో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో అధికారులు జారీ చేసిన పట్టాలకు స్థలాలను చూపించాలని కోరారు. ఇళ్లులేని పేదలకు రూ.4 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దరఖాస్తులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, బషీర్‌ఖాన్, సమీవుల్లా, రఘునాథ్ , అష్రఫ్‌అలీ, తంబయ్యశెట్టి, నారాయణస్వామి పాల్గొన్నారు.

యోగభోగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



రుద్రహోమం చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని వేదపండితులు వేద మంత్రోచ్చారణతో లక్ష బిల్వార్చన చేశారు. బిల్వపత్రాలతో స్వామికి పూజలు చేశారు. ఆలయం ఎదుట రుద్రహోమం నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో చివరి సోమవారం కేదార గౌరీవ్రతం నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కేదారగౌరివ్రతంను అర్చకులు ఫణి కుమార్‌శర్మ నిర్వహించారు. వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు. అత్తిరాసలు, పూలు,పండ్లు స్వామికి సమర్పించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో కేదారగౌరివ్రతం నిర్వహించారు.

దీపాల వెలుగులో ఆలయాలు

కార్తికమాసం చివరి సోమవారం కావడంతో మహిళలు శివాలయాల్లో దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు వాసులకు జాతీయ పురస్కారాలు



ఖాదర్‌బాషాను అవార్డుతో సత్కరిస్తున్న అభిలాష సంస్థ నిర్వాహకులు

పీలేరు : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, స్వాతంత్ర్య సమయోధులు సర్దార్ వల్లబాయ్‌పటేల్, కొమరంబీమ్ పేర్లతో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా పీలేరుకు చెందిన రంగస్థల బహుభాషా కళాకారుడు ఖాదర్‌బాషా సర్దార్ వల్లభాయ్ పటేల్ లెజెండరీ అవార్డు అందుకున్నారు. అలాగే రేగళ్లకు చెందిన షామీర్ విజయవా వరద బాధితులకు చురుగ్గా సేవ చేయడంతో ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

కలకడ : కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పక్కా గృహాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ నాగమునినాయక్ కోరారు. సోమవారం కె.బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీలలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. స్థానికులు నూతన గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ పీఎంఏవై పథకం కింద ఇంటి మంజూరు కోసం మండలంలోని ఆయా సచివాలయాలు, మండల హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇదివరకూ ఇల్లు మంజూరు కానివారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని తెలిపారు. పేదలు, అర్హత కలిగినవారు పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల, శిద్దవరం, పెద్దమండ్యం గ్రామాలలో మంగళవారం నుంచి విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. 26న కలిచెర్ల చైతన్య ఇంగ్లిషు మీడియం పాఠశాలలో, 27న పెద్దమండ్యం ఉన్నత పాఠశాలలో, 28న కేజీబీవీ పాఠశాలలో, 29న కలిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



విమలారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె: మదనపల్లె మండలం గుడిసెవారిపల్లికి చెందిన అజయ్ కుమార్ కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు మహానేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి సోదరి విమలారెడ్డి ఆదివారం రాత్రి హాజరయ్యారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్థులు, వైయస్సార్ పార్టీ నాయకులతో ముచ్చటించారు. అంతకుముందు మదనపల్లెకు వచ్చిన విమలారెడ్డిని మదనపల్లె వైయస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ సాదరంగా ఆహ్వానించి బస ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు.

కనుల పండువగా హోమాలు, అభిషేకాలు

పెద్దతిప్పసముద్రం: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా చివరి సోమవారం శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు స్వామి వారి ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, కార్తిక దీపోత్సవం కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలిరాగా వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి భోజన సౌకర్యం కల్పించారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

పీలేరు : ప్రొద్దుటూరులో ఆదివారం నిర్వహించిన ఇంటర్‌స్టేట్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పీలేరు విద్యార్థులు ప్రతిభ చూపి చాంపియన్స్‌గా నిలిచినట్లు కరాటే మాస్టర్ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కటాస్‌లో మోక్షశ్రీ, సఫా, ఫరాజిన్ బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. అలాగే కుమితే, నాన్ చాక్ పోటీల్లో చరణ్, ప్రవీణ్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు వివరించారు. సివిల్ కోర్టు జడ్జి ఎస్.ఎం. ఇస్మాయిల్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు పొందినట్లు తెలిపారు.

సబ్ కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ



సబ్ కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఏఓ రాఘవేంద్ర

మదనపల్లె: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ డీఏఓ రాఘవేంద్ర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు పెద్ద ఎత్తున వ్యక్తిగత, భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, నష్టపరిహారాలకు సంబంధించిన ఫిర్యాదులను అందజేశారు. తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మదనపల్లె మండలంలోని తట్టివారిపల్లె దేవతానగర్ ఆర్ అండ్‌బి రోడ్డును లింగిశెట్టిచెరువుకు సంబంధించిన కొండ వంకను కొందరు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సుమారు 5 సంవత్సరాలుగా ఇరిగేషన్, రెవిన్యూ, ఆర్ అండ్‌బి శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని దేవతానగర్‌కు చెందిన శ్రీరాములు ఫిర్యాదు చేశారు. వారసత్వంగా తండ్రి ద్వారా సంక్రమించిన డికెటి భూమిని తన కుటుంబీకులు తనకు తెలియకుండా ఆక్రమణకు పాల్పడగా కోర్టుకు ఆశ్రయించానని, అయినా వారు నిబంధనలకు విరుద్ధంగా పట్టా పొంది విక్రయించారని దుబ్బిగానిపల్లెకు చెందిన కొప్పాల లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. అలాగే కొత్తవారిపల్లె పంచాయతీ పాలంకొండకు చెందిన కృష్ణమూర్తి తన భార్య పద్మావతమ్మ 16.3.2023న పిడుగుపడి మృతిచెందిదని అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం పరిహారం అందించలేదని, వెంటనే తనకు సహాయం చేసి పరిహారం అందించాలని వినతిపత్రం అందజేసింది.

దారి ఆక్రమణలు తొలగించి ఆదుకోండి



తహసీల్దార్‌కు దారి సమస్యపై వినతిపత్రం అందజేస్తున్న బంగారువాండ్లపల్లె గ్రామస్తులు

కలకడ : దారి ఆక్రమణలు తొలగించి గ్రామస్తులను ఆదుకోవాలని మండలంలోని కోన పంచాయతీ బంగారువాండ్లపల్లె గ్రామానికి చెందిన గ్రామస్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ పనికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామం నుంచి ఐదు దశాబ్దాలుగా రైతుల పంట పొలాలకు, వ్యవసాయ సాగుకు దాదాపుగా 50 కుటంబాల వారు ఆధారపడిన దారిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అడ్డుకుని జేసీబీతో చదును చేసి మామిడిచెట్లు నాటి అడ్డగించారని ఫిర్యాదు చేశారు. రైతులు పశువులు, గొర్లు, మేకలు ఇలా అందరు నడిచే దారిని అడ్డగించడం దారుణమన్నారు. స్పందించిన తహసీల్దార్ పనికుమార్ 48గంటల్లో సర్వేయర్, వీఆర్వోతో నేరుగా హాజరై దారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్పందన ఫిర్యాదులపై స్పందించండి

ప్రభుత్వ భూముల పరిరక్షణ, స్పందనలో అందిన ఫిర్యాదులపై సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలని తహసీల్దార్ పనికుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి డాట్‌ల్యాండ్ సమస్యలు, స్పందనలో వచ్చిన ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులను సమీక్షించి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు చైర్మన్ బాధ్యతలు స్వీకరణ



టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్‌ను అభినందిస్తున్న నాయకులు

మదనపల్లె: మదనపల్లె టౌన్ బ్యాంకు చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా హాజరుకాగా ఎన్నికల అధికారి దుర్గమ్మ, సీఈఓ ప్రసాద్ సమక్షంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ భాస్కర్‌కుమార్, మరో పది మంది డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టారు. టౌన్‌బ్యాంకు పాలవర్గాన్ని ఎమ్మెల్యేతో పాటు చిప్పిలి సర్పంచు చలపతి, మురళినాయుడు, చిప్పిలి హరి, చిరు, మాజీ సైనికుడు శివారెడ్డి అభినందించారు. ఇటీవల టౌన్ బ్యాంకు ఎన్నికలకు నామినేషన్లు ప్రక్రియ ముగియగా నాదెళ్ల విద్యాసాగర్ చైర్మన్‌గాను, డైరెక్టర్లుగా ముక్తియార్‌ఖాన్, సూరే రవీంద్రనాథ్, రాటకొండ సోమశేఖర్, నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామరవికాంత్‌బు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్,జె.క్రిష్ణమూర్తి దేవంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న ఏఈసీఈఏ అధ్యక్షుడు సుధాకర్

మదనపల్లె: విద్యుత్‌శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఈసీఈఏ) అధ్యక్షుడు ఎం.సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మదనపల్లె డివిజన్ ప్రెసిడెంట్ యశ్వంత్‌తో కలిసి సమస్యలపై మాట్లాడారు. విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేష్ హామీ ఇచ్చారన్నారు. హామీని నిలబెట్టుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ యాజమాన్యం హెచ్‌ఆర్ కమిటీ అన్ని డిస్కంల సీఎండీలతో జరపనున్న నేపథ్యంలో, చర్చలలో కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ ఉద్యోగులను భాగస్వామ్యం చేయాలన్నారు. 2014లో వేసిన రెగ్యులరేషన్ కమిటీ నివేదిక పరిశీలించాలని పీఆర్‌సి బకాయిలు చెల్లించాలని, కార్మిక చట్టాలను అనుసరించి కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమానవేతనం, సర్వీసు ఇన్సెంటివ్, ప్రమాదబీమా, ఫ్యామిలీ హెల్త్ పాలసీ, రిటైర్డు బెనిఫిట్స్ రూ.20 లక్షలు, ప్రమోషన్లు తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో కలికిరి ప్రెసిడెంట్ భాస్కర్, 400 కెవి డివిజన్ ప్రెసిడెంట్ కళ్యాణ్‌కుమార్, నాయకులు లక్ష్మీనారాయణ, రియాజ్‌బాషా, రెడ్డప్ప, మునివెంకోబరావు, వేణుగోపాలరావు, అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జెండర్ రిసోర్స్ సెంటర్

మదనపల్లె: డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారానికే జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జెండర్ రిసోర్సు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు ఆధ్వర్యంలో మండల,గ్రామ స్థాయిలో సోషియల్ యాక్షన్ కమిటీలు పని చేస్తున్నాయన్నారు. ప్రతి మండలంలో ఇప్పటికే కుటుంబ ఉచిత న్యాయ సలహా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ లైవ్‌లీ హుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 12 జెండర్ రిసోర్సు సెంటర్లను మంజూరు చేసిందన్నారు. మదనపల్లె మండలంను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇక్కడ జెండర్ రిసోర్సు సెంటర్ ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం రిసోర్సుపర్సన్ కిజర్‌హయత్‌ఖాన్ సభ్యులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 25 వరకు జెండర్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ తాజ్‌మన్నూర్, బ్యాంకు లింకేజీ డీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏపీఎం సుబ్రమణ్యం, సీసీలు గంగులప్ప, శివశంకర్,శివారెడ్డి, గోపాల్‌రెడ్డి, శారద,లక్ష్మీదేవి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరస్వామి వ్రతం



నోములవ్రతంలో పాల్గొన్న భక్తులు

పీలేరు రూరల్ : స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం నాలుగో సోమవారంను పురస్కరించుకుని మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం భక్తి శ్రద్ధల తో చేపట్టారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పలువురు మహిళా భక్తులు కేదారేశ్వరస్వామి వ్రతం చేపట్టి నోములు నోచుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కుమార్‌స్వామి నోముల వ్రతం కథను చదివి వినిపించారు.

వీఆర్వోలకు పనిభారం తగ్గించాలి

పీలేరు రూరల్ : వీఆర్వోలకు పనిభారం తగ్గించాలని వీఆర్వో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యల్లప్ప, కల్యాణి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధం లేని పనులు కూడా తమకు చెప్పి చేపిస్తున్నారని తెలిపారు. దీంతో వీఆర్వోలకు పనిభారం పెరుగుతోందన్నారు. నిబంధనల ప్రకారం తమకు ఏ పనులు ఉన్నాయో అవి మాత్రమే చేపించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు హేమంత్ నాయక్, రెడ్డిశేఖర్, సిద్దయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్, ఇబ్రహీంసాబ్, కదిరప్ప, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలకు ఇతర శాఖల పనుల భారం నుంచి తప్పించాలని వీఆర్వోలు కోరారు. సోమవారం మండలంలోని వీఆర్వోలు తహసీల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తాము చేయాల్సిన పనులన్నీ చేస్తున్నామని తెలిపారు. అయితే పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పనులు వీఆర్వోలకు అప్పగించి రెగ్యులర్ రెవెన్యూ విధులకు ఆటంకం కల్గిస్తున్నారని చెప్పారు. 2019కి ముందు విధానాన్ని అమలు చేసి వీఆర్వోలు విధులు నిర్వహించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు నవీన్, యర్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.